# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దినపత్రిక

సంపుటి : 02    సంచిక : 79    బుధవారం    17-12-2025    పేజీలు : 4    వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## భారత్‌లోనూ సిడ్నీ తరహా దాడులకు ఛాన్స్

# రాష్ట్రాలకు హెచ్చరిక



సిడ్నీ బాండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడితో భారత్ కూడా అప్రమత్తమైంది. మరి కొద్ది రోజుల్లో కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో ఐసిస్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులు చేయవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ముఖ్యంగా దక్షిణాదిలో వేర్పాటువాద డ్రైవ్‌లు, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని వాడుకుంటూ యువతను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అనుమానిస్తున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో యూదు, ఇజ్రాయెల్ సంబంధిత ప్రదేశాలపై దాడులు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్ రాష్ట్రం సిడ్నీ బాండీ బీచ్‌లో డిసెంబరు 14న జరిగిన ఉగ్రదాడితో భారత్ అప్రమత్తమైంది. దేశంలోని అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసిన నిఘా వర్గాలు... సిడ్నీ తరహదాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించాయి. ముఖ్యంగా కొత్త ఏడాది వేడుకలు సమీపిస్తున్న తరుణంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, ఐసిస్ ప్రేరేపిత ఉగ్రమూకలు పలు ప్రాంతాలను టార్గెట్ చేసుకోవచ్చని అలర్ట్ చేశాయి. యూదుల పండుగ హనుక్కా మొదటి రోజున బాండీ బీచ్‌లో హైదరాబాద్‌కు చెందిన సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు నవీద్ జరిపిన కాల్పుల్లో 16 మంది చనిపోగా.. మరో 38 మంది గాయపడిన సంగతి తెలిసిందే. నిందితులు ఐసిస్ భావజాలంతో ప్రభావితమయ్యారని ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ స్వయంగా ప్రకటించారు. ఈ తండ్రీ కొడుకుల్లో ఒకరి వద్ద భారత పాస్‌పోర్టు ఉండగా.. గత నెల ఇరువురూ ఫిలిప్పీన్స్‌కు వెళ్లి వచ్చినట్టు గుర్తించారు. ఈ పరిణామాలతో భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్రాలకు భారత నిఘా సంస్థలు (ఐబీ) సూచించాయి. సిడ్నీ దాడిని ఉదాహరణంగా చూపి, ఐసిస్ అనుబంధ గ్రూప్‌లు యువతను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాదిలో వేర్పాటువాద డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని కూడా తీవ్రవాద సంస్థలు రిక్రూట్‌మెంట్లకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. న్యూ ఇయర్ వేడుకలకు భారీగా పర్యాటకులు వచ్చే గోవా వంటి రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేసిన జైషే మహమ్మద్ ప్రేరేపిత వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడుకు తెగబడిన విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. పోలీసులు ఏమాత్రం అలసత్వంగా ఉన్నా ముష్కర మూకలు దాడులకు తెగబడే ప్రమాదం ఉందని, కాబట్టి అప్రమత్తత అత్యవసరమని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. స్థానిక మీడియా పేర్కొన్న నిఘా వర్గాల అంచనా ప్రకారం.. ఉగ్రవాద సంస్థలు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు సహా ప్రధాన నగరాల్లో యూదు, ఇజ్రాయెల్‌కు సంబంధిత ప్రదేశాలపై దాడులు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు భావిస్తున్నారు. ఈ హెచ్చరికలను అత్యంత తీవ్రమైనవిగా భద్రతా వర్గాలు అభివర్ణించాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా యూదుల ప్రార్థనా స్థలాలు, ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాలు, అలాగే యూదు, ఇజ్రాయెల్ సముదాయాలు నివసించే నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పలు పట్టణ కేంద్రాల్లో నిఘాను విస్తరించడంతో పాటు, సున్నిత ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు.

## మహబూబ్‌నగర్ పోలీసుల సమగ్ర బందోబస్తు..



- గామపంచాయతీ మూడో విడత ఎన్నికలకు మహబూబ్‌నగర్ పోలీసుల సమగ్ర బందోబస్తు...
- జడ్చర్లలో పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ డి.జానకి బ్రీఫింగ్..
- 145 గ్రామాలు, 212 పోలింగ్ కేంద్రాల్లో 1249 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత...

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా బుధవారం జరగనున్న గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్చర్ల మండల కేంద్రంలో బి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్నికల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. జానకి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాటించాల్సిన చేయవలసినవిఉచేయకూడనివి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా చురుకుగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తిన పక్షంలో తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల బందోబస్తు నిమిత్తం మొత్తం 1249 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో 1 ఎస్పీ, 2 అదనపు ఎస్పీలు, 7 డీఎస్పీలు, 29 ఇన్స్పెక్టర్లు, 66 సబ్ ఇన్స్పెక్టర్లు ఉండగా, మిగిలిన 1144 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఈ బందోబస్తు అడ్డకల్, బాలానగర్, భూత్పూర్, జడ్చర్ల, మూసాపేట, నవాబుపేట మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 145 గ్రామాల్లో 212 పోలింగ్ కేంద్రాలు, 1254 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 44 సమస్యాత్మక గ్రామాల్లో 52 పోలింగ్ కేంద్రంలో 394 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. భద్రతా చర్యల్లో భాగంగా 44 రూట్ మొబైల్స్, 16 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఎఫ్ ఎస్ టి , 5 స్ట్రైకింగ్ ఫోర్సులు, 5 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు మోహరించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎస్పీ డి. జానకి స్పష్టం చేశారు.

## ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం.

చిలుకూరు అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం. క్రైం కౌంటర్ న్యూస్, చిలుకూరు. డిసెంబర్ 16 ( గురునాథం జిల్లా బ్యూరో)మంగళవారం మార్గశిర మాసం ది.16-12-2025, 4 వ మంగళవారం సందర్భంగా మన చిలుకూరు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ శ్రీ రామ జయ రామ జయ జయ రామ అంటూ స్మరిస్తూ మొక్కలు తీర్చుకుంటూ, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. ఆలయం అర్చకులు ఈ రోజు భక్తులు చేత ప్రత్యేకంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామి కి ప్రత్యేక అభిషేకాలు ఆకు పూజలు నిర్వహించారు. తదనంతరం భక్తులకు ఆలయం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చిలుకూరు మాజీ సర్పంచ్ కోడారు లక్ష్మయ్య- కామేశ్వరి దంపతులు అన్నదాన కార్యక్రమానికి అరకింట బియ్యం ఇవ్వడం జరిగింది. ఈరోజు అన్నదానం చేయించిన దాతలు జెర్రిపోతులగూడెం వాస్తవ్యులు కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు. ఇట్టి అన్నదానం కార్యక్రమమునకు చిలుకూరు నూతన గ్రామ పంచాయతీ సర్పంచ్ గా గెలిచిన శ్రీ కొల్లు పుల్లమ్మ నాగయ్య దంపతుల ప్రత్యేక అతిధులుగా పాల్గొని అన్నదాన కార్యక్రమమును ప్రారంభించారు. ఈరోజు దేవాలయంలో లడ్డు దాతలు అత్తులూరి వాసు, ధనలక్ష్మి, గ్రిస్మిత, భవిత్ సాయి. ఈ కార్యక్రమంలో ఆలయం ఛైర్మన్ శ్రీ కొడారు వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ మాదారపు లక్ష్మయ్య, కట్టెకోల చంద్రయ్య, చలమయ్య గారి శ్రీను, బొమ్మిరెడ్డి సమ్మిరెడ్డి, గోపయ్య, వీరభద్రం, రోజా భవానీ, లక్ష్మీ లావణ్య మంగమ్మ పద్మ, తదితరులు పాల్గొన్నారు. తదుపరి ఆలయం సంప్రదాయం ప్రకారం అన్నదానం చేయించిన భక్తులకు స్వామి వారి దివ్య ఆశీస్సులతో, మెమోంటో తో సన్మానం చేసి ఆశీర్వాదం అందజేసారు.





## బొమ్మన్నపల్లి పోలింగ్ స్టేషన్ ను విసిట్ చేసిన....

సిద్దాపూర్ పోలీస్ స్టేషన్ క్రిటికల్ గ్రామపంచాయతీ గా ఉన్న బొమ్మన్నపల్లి పోలింగ్ స్టేషన్ ను విసిట్ చేసిన.... జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్ క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి నాగర్ కర్నూల్ జిల్లా: - నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఈరోజు అచ్చంపేట సబ్ డివిజన్ పరిధిలోని సిద్దాపూర్ పోలీస్ స్టేషన్ క్రింద క్రిటికల్ గ్రామపంచాయతీలో ఉన్న బొమ్మనపల్లి పోలింగ్ స్టేషన్ ని సందర్శించి అక్కడ ఉన్న పోలీస్ ఆఫీసర్స్ కి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందీ, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భద్రతా



## క్రిస్టమస్ సందర్భంగా.. విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చిలు. .





క్రీస్తు జన్మదినం గురించి.. ఒకవైపు డాన్స్ మరోవైపు స్కిట్.. ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు....

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి: - నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో గల ఎంబి చర్చ్ క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ లైటింగ్ తో అలంకరించబడ్డాయి. ఒకవైపు నక్షత్రం. మరోవైపు విద్యుత్ దీపాలతో ముస్తాబైన కల్వకుర్తి ఎంబి చర్చ్. క్రిస్మస్ క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులు చక్కటి సంస్కృతిక కార్యక్రమాలకు ప్రాక్టీస్ చేస్తున్నారు. వీటితోపాటు క్రీస్తు జననం గురించి డ్రామా ప్రాక్టీస్ చేస్తున్నారు . ఈ కార్యక్రమం సెమీ క్రిస్మస్ రోజు ఉంటుందని. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున కల్వకుర్తి పట్టణంలోని సహోదరి సహోదరులు రాగలరని. కల్వకుర్తి ఎం.బి చర్చ్ సంఘ సభ్యులు తెలిపారు.

## నారాయణపురం సర్పంచ్ మండవ జయమ్మ





వెంకటేశ్వర్లు ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సిపిఐ జిల్లా కార్యదర్శి.

క్రైం కౌంటర్ న్యూస్ చిలుకూరు, నారాయణపురం. డిసెంబర్ 16 ( గురునాథం జిల్లా బ్యూరో) చిలుకూరుమండల పరిధిలోని నారాయణపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి మండల జయమ్మ వెంకటేశ్వర్లు సర్పంచిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం కమ్యూనిస్టు పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆయన నివాస గృహములో మర్యాదపూర్వకంగా కలిసి శాలువుతో సర్పంచి దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఈ సందర్భంగా బెజవాడ మాట్లాడుతూ పేదల పార్టీ కమ్యూనిస్టు పార్టీ గెలుపుతో గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే నిరుపేదల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. జయమ్మ ఆధ్వర్యంలో గ్రామం అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు. సంఘం రాష్ట గ్రామ కమ్యూనిస్టు పార్టీ నాయకులు నాయకులు సోమగాని విష్ణు గౌడ్, రాజశేఖర్, కొండ కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మంత్రి ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిసిన రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షులు అసిఫ్ అలి. గుజ్జుల మహేష్.



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్: - మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి.తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత రెడ్డి సోదరులు కృష్ణా రెడ్డి జగదీశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిన రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షులు అసిఫ్ అలి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీమాజీ అధ్యక్షులు గుజ్జల మహేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్రాజు రెడ్డి .మాజీ సర్పంచ్ బండి రఘుపతి ,మల్లేష్ గౌడ్ .తిరుపతి ముదిరాజ్ .నరేష్ పాల్గొన్నారు



## ఒడ్డేటి నాగమణి సర్పంచ్ విజయం అభివృద్ధి లక్ష్యానికి బలమైన అడుగు

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 16

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు గ్రామ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచాయి. అభివృద్ధి కావాలన్న ఆశ, పారదర్శక పాలన కావాలన్న ఆకాంక్ష, నిజాయితీ గల నాయకత్వం కావాలన్న ప్రజల ఆక్రందన ఈ ఎన్నికల ద్వారా స్పష్టంగా వెలువడింది. ఆది నుంచే బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మద్దతుతో బరిలో నిలిచిన ఒడ్డేటి నాగమణి -నానయ్య ప్రజల నమ్మకాన్ని గెలుచుకొని ఘన విజయం సాధించారు.

ప్రజాస్వామ్యం బతికే ఉందని చాటిన ఓటింగ్

ఈ గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 7,493 మంది ఓటర్లు ఉండగా, వారిలో 5,921 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించిన క్యూలు, వృద్ధులు-యువత-మహిళలు తేడా లేకుండా ఓటు వేసేందుకు వచ్చిన దృశ్యాలు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసినట్టుగా కనిపించాయి. మన గ్రామం మన భవిష్యత్" అన్న భావన ప్రతి ఓటులో ప్రతిఫలించింది.

ప్రతి వార్డులో ఉత్కంఠౌ చివరికి ఆశ గెలిచింది

మొత్తం 14 వార్డులు ఉన్న సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రతి వార్డులోనూ పోటాపోటీ వాతావరణం నెలకొంది. ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామమంతా ఉత్కంఠతో ఊపిరి ఆపుకుంది. చివరి రౌండ్లు పూర్తయ్యేసరికి ప్రజల ఆశలకు ప్రతిరూపంగా ఒడ్డేటి నాగమణి విజయం సాధించారు.

524 ఓట్ల మెజార్టీ నమ్మకానికి ముద్ర

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిపై 524 ఓట్ల స్పష్టమైన మెజార్టీతో నాగమణి విజయం సాధించడం కేవలం సంఖ్య కాదౌ అది ప్రజలు ఆమెపై ఉంచిన విశ్వాసానికి ముద్ర. గ్రామంలో మాటకన్నా పని ముఖ్యం అన్న సందేశాన్ని ప్రజలు ఈ తీర్పుతో ఇచ్చారు.

ఉపసర్పంచ్‌గా దుర్గం ప్రశాంత్ ఐక్యతకు చిహ్నం

ఎన్నికల అనంతరం జరిగిన వార్డు సభ్యుల సమావేశంలో 14 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా దుర్గం ప్రశాంత్‌ను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఇది వ్యక్తిగత రాజకీయాలకు కాదౌ గ్రామ అభివృద్ధికి కలిసి నడవాలన్న సంకల్పానికి నిదర్శనం.

అభివృద్ధి దిశగా అడుగులు

సర్పంచ్ ఒడ్డేటి నాగమణి, ఉపసర్పంచ్ దుర్గం ప్రశాంత్ నేతృత్వంలో సిర్పూర్(టీ) గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందన్న నమ్మకం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది. త్రాగునీరు, అంతర్గత రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు ఇవన్నీ ఇక మాటల్లో కాకుండా పనుల్లో కనిపించాలని గ్రామస్తులు ఆశిస్తున్నారు.


ఇది ఒక గెలుపు కాదౌ ఇది ప్రజల విజయం ఈ ఎన్నికల ఫలితం ఒక పార్టీకి లేదా ఒక వ్యక్తికి మాత్రమే చెందినది కాదు. ఇది ప్రజల ఆశలకు, కలలకు, పోరాటాలకు దక్కిన విజయం. ప్రజాస్వామ్యం గ్రామ స్థాయిలో ఇంకా బలంగా ఉందని నిరూపించిన తీర్పు ఇది. సిర్పూర్(టీ) మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చాయి ప్రజల మాట వినే నాయకత్వానికే ప్రజలు పట్టం కడతారు



## ఇక ధనాధన్ అకౌంట్లోకి డబ్బులు..



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. వచ్చే మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు గ్రీన్ చానెల్ ద్వారా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బులు నేరుగా వెళ్లనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులు ఇకపై పరుగులు పెట్టనున్నాయి. నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన పాత బిల్లులు, కొత్త దశల వారీ చెల్లింపుల కోసం ప్రభుత్వం భారీ ఎత్తున నిధులను సమీకరించింది. దీనివల్ల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులకు పెద్ద ఉపశమనం లభించనుంది.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక వనరుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుండి రూ. 5 వేల కోట్ల భారీ రుణాన్ని తీసుకుంది. ఈ నిధుల రాకతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బిల్లులను త్వరలోనే వారి వారి ఖాతాల్లో జమ చేసేందుకు హౌసింగ్ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. బేస్మెంట్, స్లాబ్ మరియు ఫినిషింగ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రతీ సోమవారం గ్రీన్ చానెల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపిణీ చేయనుంది. నిధుల లభ్యత పెరగడంతో.. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కలెక్టర్లు , ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు అందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు.. అంటే మార్చి 31 నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని



ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా.. ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయి. హౌసింగ్ సెక్రటరీ, కార్పొరేషన్ అధికారులు నిత్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు.ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించింది. హడ్కో లోన్ , భూముల వేలం ద్వారా వచ్చిన నిధులతో కలిపి ఈ మార్చి లోపు రికార్డు స్థాయిలో ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం, పెండింగ్ బిల్లుల విడుదల వార్త ఇప్పుడు లబ్ధిదారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు బిగ్ అలర్ట్..



తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. మార్చి 3వ తేదీన హోలీ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో.. ఆ రోజు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసింది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండ్ ఇయర్ మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ఇప్పుడు మార్చి 4వ తేదీన జరుగుతాయి. మిగిలిన పరీక్షలన్నీ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు యథావిధిగా కొనసాగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 21 వరకు జరుగుతాయని.. వాటిలో ఎలాంటి మార్పు లేదని బోర్డు స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తూ మంగళవారం కీలక ప్రకటన విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న ఈ పరీక్షల్లో భాగంగా.. మార్చి 3వ తేదీన నిర్వహించాల్సిన పరీక్షలను ఒక రోజు ముందుకు జరుపుతూ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 3న హోలీ పండగ జరుపుకోనున్న నేపథ్యంలో.. ప్రభుత్వం ఆ రోజును అధికారిక సెలవుగా ప్రకటించింది. దీంతో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల తేదీని మార్చారు.రాష్ట్రంలో ఇంటర్ రాత పరీక్షలు ఫిబ్రవరి 25వ తేదీన ప్రారంభమై మార్చి 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్.. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహించనున్నారు.ముఖ్యంగా ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు గమనించాల్సిన విషయం ఏమిటంటే.. మార్చి 3న జరగాల్సిన మ్యాథమెటిక్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను ఇప్పుడు మార్చి 4వ తేదీన నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రం మార్చి 2న గణితం 1ఏ, బోటనీ పరీక్షలు యథావిధిగా జరుగుతాయి. ఇంటర్ బోర్డు ప్రకటించిన తాజా షెడ్యూల్ ప్రకారం పరీక్షల వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 25న.. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షతో రాత పరీక్షలు మొదలవుతాయి. మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 26న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ ఉంటుంది.ఫిబ్రవరి 27, 28 తేదీల్లో.. వరుసగా మొదటి , రెండో సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 2 వ తేదీన.. ఇంటర్ ఫస్ట్ ఇయర్ మ్యాథమెటిక్స్ 1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు జరుగుతాయి. మార్చి 4వ తేదీన సవరించిన తేదీ ప్రకారం సెకండ్ ఇయర్ మ్యాథమెటిక్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ఉంటాయి. మార్చి 5 , 6వ తేదీల్లో.. ఫస్ట్ ఇయర్ మరియు సెకండ్ ఇయర్ విద్యార్థులకు మ్యాథమెటిక్స్ 1బీ/2బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు ఉంటాయి. మార్చి 9 , 10 తేదీల్లో.. భౌతిక శాస్త్రం (ఫిజిక్స్), ఎకనమిక్స్ పరీక్షలు వరుసగా రెండు సంవత్సరాల విద్యార్థులకు జరుగుతాయి. మార్చి 12 , 13వ తేదీల్లో రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ), కామర్స్ పరీక్షలతో ప్రధాన సబ్జెక్టులు ముగుస్తాయి.ప్రాక్టికల్ పరీక్షల్లో మార్పు లేదు..రాత పరీక్షల కంటే ముందే నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి ప్రారంభమై ఫిబ్రవరి 21 వరకు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు మారిన తేదీలను గమనించి.. గందరగోళానికి గురికాకుండా తమ ప్రిపరేషన్‌ను కొనసాగించాలని అధికారులు సూచించారు. సవరించిన పూర్తి షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచారు.




# టీమిండియా పరుగుల వరద 408/7



అండర్ – 19 ఆసియా కప్‌లో టీమిండియా దుమ్ము రేపుతోంది! మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు డబుల్ సెంచరీతో చెలరేగడంతో, భారత్ 408 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇప్పటికే రెండు సార్లు 400 కు పైగా స్కోర్లు చేసిన టీమిండియా, ఈ టోర్నీలో అదరగొడుతోంది. అభిగ్యాన్ డబుల్ సెంచరీ చేయగా, వేదాంత్ 90 పరుగులు నమోదు చేశాడు. వైభవ్ సూర్యవంశీ 50 పరుగులు చేసి అవుటయ్యాడు. అండర్ 19 ఆసియా కప్‌లో టీమిండియా దూసుకుపోతోంది. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడితే రెండు సార్లు 400కు పైగా పరుగులు నమోదు చేసింది. మలేషియాతో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో టీమిండియా వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు డబుల్ సెంచరీతో పరుగుల వరద పారించాడు. టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన మలేషియా జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. దుబాయ్ వేదికగా జరిగిన గ్రూప్ ఏ మ్యాచ్‌లో భారత్ – మలేషియా జట్లు ఈ రోజు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిని మలేషియా ఫీల్డింగ్ ఎంచుకుని భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఆరంభం నుంచి హిట్టింగ్ ప్రారంభించిన టీమిండియా.. పవర్ ప్లేలో బౌండరీల మోత మోగించింది. అదే సమయంలో వికెట్లు కూడా చేజార్చుకుంది.కెప్టెన్ ఆయుష్ మాత్రే, ఫస్ట్ డౌన్ బ్యాటర్లు విహాన్ మల్హోత్రా త్వరగా వికెట్లు కోల్పోగా.. వైభవ్ సూర్యవంశీ 26 బంతుల్లోనే ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 50 పరుగులు చేసి అవుటయ్యాడు. వేదాంత్ త్రివేది కూడా నిలకడగా ఆడి 106 బంతుల్లో ఏడు ఫోర్లతో 90 పరుగులు చేసి సెంచరీ మిస్ చేసుకున్నాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన టీమిండియా వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు మలేషియా బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. 125 బంతులు ఆడిన అభిగ్యాన్ 17 ఫోర్లు, 9 సిక్సర్లతో 209 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వేదాంత్, అభిగ్యాన్ నాలుగో వికెట్‌కు ఏకంగా 209 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో కనిష్క్ చౌహాన్ – అభిగ్యాన్ 36 బంతుల్లో 87 పరుగులు బాదడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 408 పరుగులు చేసింది. మలేషియా బౌలర్ మొహమ్మద్ అక్రమ్ ఐదు వికెట్లు తీసుకున్నాడు.అండర్ 19 ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లలో భారత్ ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరిగిన తొలి మ్యాచ్ 433 పరుగులు చేయగా, ఆ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 171 పరుగులు బాదాడు. పాకిస్తాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 240 పరుగులు మాత్రమే చేసినా దాయాదిని 150 పరుగులకే ఆలౌట్ చేసి విజయం సాధించింది. ఇక మూడో మ్యాచ్‌లో మలేషియాపై 408 పరుగులు చేసింది. ఇలా ఆడిన మూడు మ్యాచ్‌లలోనే రెండు సార్లు 400కు పైగా స్కోర్ నమోదు చేసి రికార్డు సృష్టించింది.

# గుండు అంకుల్ మళ్లీ రేటు పెంచేశారు




ఐపీఎల్ 2026 మినీ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ కో – ఓనర్ గ్రంధి కిరణ్ కుమార్ తనదైన శైలిని ప్రదర్శించారు. మతీషా పతిరణ కోసం లక్నోతో పోటీపడి ధరను రూ. 15 కోట్లకు పెంచారు. అయితే, చివరికి కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 18 కోట్లకు పతిరణను సొంతం చేసుకుంది. గత సీజన్‌లో పతిరణ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోయినా, ఈ వేలంలో భారీ ధర పలికాడు. గత సీజన్‌లో రూ. 13 కోట్లు పలికిన పతిరణ ఈ సారి రూ. 18 కోట్లకు అమ్ముడయ్యాడు. ఐపీఎల్ వేలం వచ్చిదంటే ఢిల్లీ క్యాపిటల్స్ కో ఓనర్ గ్రంధి కిరణ్ కుమార్ వార్తల్లో నిలుస్తారు. తెలుగువాడైన గ్రంధి కిరణ్ కుమార్ వేలంలో ప్లేయర్ల రేట్లు పెంచడంలో సిద్ధహస్తుడు. ఏదైనా టీమ్ ఒక ప్లేయర్ కోసం బిడ్ చేస్తుంది అంటే రేటును అమాంతం పెంచేసి ఆ జట్టును ఇరకాటంలో పెట్టడమో, ఎక్కువ ధరకు ఆ ప్లేయర్‌ను కొనుగోలు చేయించడమో చేస్తాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలోనూ గ్రంధి కిరణ్ కుమార్ సరిగ్గా అదే పని చేశారు. మతీషా పతిరణ కోసం లక్నోతో పోటీపడి రేటును అమాంతం పెంచేశారు.ఐపీఎల్ మినీ వేలానికి రూ.2 కోట్ల బేస్ ప్రైజ్‌తో వచ్చిన పతిరణ కోసం లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత పోటీ పడ్డాయి. పర్స్‌లో దాదాపు ఒకటే ధర ఉన్న ఇరు ఫ్రాంఛైజీలు పతిరణ కోసం బిడ్ చేశాయి. సాధారణంగా పతిరణ రూ.10 కోట్ల వరకు వేలంలో వెళ్తాడని అందరూ భావించారు. కానీ లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, ఢిల్లీ క్యాపిటల్స్ కో ఓనర్ గ్రంధి శ్రీనివాస్ ఈ ధరను రూ.15 కోట్ల వరకు తీసుకెళ్లారు. దాదాపు రూ.16 కోట్లకు చేరుకోగానే ఢిల్లీ డ్రాప్ అయింది.పతిరణ లక్నోకి సొంతం అవుతాడు అనుకోగానే సడెన్‌గా రంగంలోకి కేకేఆర్ వచ్చింది. అభిషేక్ నాయర్ పతిరణ కోసం ఇంకాస్త ఎక్కువ ధర పెట్టేశాడు. రూ. 18 కోట్ల వరకు బిడ్ చేసిన సంజీవ్ గోయెంకా చివరికి డ్రాప్ అయ్యాడు. దాంతో పర్స్‌లో అత్యధిక డబ్బులు ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీ రూ. 18 కోట్లకు పతిరణను సొంతం చేసుకుంది.ఐపీఎల్ 2025 మెగా వేలంలో మతీషా పతిరణను చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంఛైజీ బయటకు వదిలేసి తిరిగి రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. అయితే గత సీజన్‌లో పతిరణ ఆశించిన స్థాయిలో రాణించలేదు. 13 మ్యాచ్‌లు ఆడిన పతిరణ కేవలం 12 వికెట్లు మాత్రమే తీయడంగాక, ఓవర్‌కి 10కి పైగా పరుగులు సమర్పించుకున్నాడు. దాంతో ఈ సారి చెన్నై సూపర్ కింగ్స్ వేలంలో పతిరణ కోసం ప్రయత్నం కూడా చేయలేదు. ఢిల్లీ–లక్నో–కోల్‌కతా మధ్య జరిగిన త్రిముఖ పోరులో రూ.18 కోట్లకు కేకేఆర్ సొంతం చేసుకుంది.

# కామెరాన్ గ్రీన్ రూ. 25.2 కోట్లు



ఐపీఎల్ 2026 మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ రూ.25.20 కోట్ల భారీ ధర పలికాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంఛైజీ గ్రీన్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా కామెరూన్ గ్రీన్ నిలవడం విశేషం. అయితే రూ.25.2 కోట్లు పలికినా.. గ్రీన్ జీతం రూ. 18 కోట్లకు మాత్రమే పరిమితం కానుంది, మిగిలిన మొత్తం బీసీసీఐ ప్లేయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు వెళ్తుంది. ఐపీఎల్ 2026 మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ చరిత్ర సృష్టించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అతడిని రూ.25.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేయడంతో, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. ఈ ప్రక్రియలో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తీవ్ర బిడ్డింగ్ పోరు అందరి దృష్టిని ఆకర్షించింది.ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ పేరిట ఉండేది. అతడిని కూడా కోల్‌కతానే ఐపీఎల్ 2024 వేలంలో రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. మొత్తం ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా మాత్రం రిషభ్ పంత్ కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ అతడిని రూ.27 కోట్లకు దక్కించుకుంది. అదే వేలంలో శ్రేయస్ అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్లకు కొనుగోలు చేయడం మరో విశేషం.రూ.25 కోట్ల మార్క్ దాటిన బిడ్ వచ్చినప్పటికీ, ఐపీఎల్ 2026 సీజన్‌కు గాను కామెరూన్ గ్రీన్ పొందే జీతం మాత్రం రూ.18 కోట్లకే పరిమితం కానుంది. ఇందుకు కారణం ఐపీఎల్‌లో అమలులో ఉన్న మ్యాక్జిమమ్ ఫీ రూల్. ఈ నిబంధన ప్రకారం, మినీ వేలంలో పాల్గొనే విదేశీ ఆటగాడికి చెల్లించే గరిష్ట వేతనం అత్యధిక రిటెన్షన్ స్లాబ్ రూ.18 కోట్లు మాత్రమే. ఈ ప్రకారం గ్రీన్‌కు రూ. 18 కోట్లు మాత్రమే వస్తుంది. మిగిలిన మొత్తం బీసీసీఐ నిర్వహించే ప్లేయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు వెళ్తుందని ఐపీఎల్ వేలం నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.ఇంత భారీ ధర పలికినా, కామెరూన్ గ్రీన్‌పై కేకేఆర్ పెట్టుబడి పెట్టడానికి కారణం అతని ఆల్‌రౌండ్ సామర్థ్యమే. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లకు ప్రాతినిధ్యం వహించిన గ్రీన్ 29 మ్యాచ్‌ల్లో 707 పరుగులు చేయడంతో పాటు 16 వికెట్లు కూడా పడగొట్టాడు. టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడం, అవసరమైతే బౌలింగ్‌లోనూ కీలక ఓవర్లు వేయగలగడమే ఇందుకు కారణం. ఆ కారణంతో ఐపీఎల్ 2026 వేలంలో అతడిపై ఫ్రాంచైజీలు భారీగా పోటీ పడ్డాయి. చివరికి కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకుంది.

# బృందావన్‌లో విరాట్ కోహ్లీ – అనుష్క శర్మ



భారత్‌కు తిరిగి వచ్చిన టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మతో కలిసి బృందావన్‌లోని శ్రీహిత్ రాధా కేళి కుంజ్ ఆశ్రమాన్ని సందర్శించి ప్రేమానంద్ జీ మహారాజ్‌ను కలిశారు. జీవితంపై విలువైన ఆధ్యాత్మిక సందేశం అందుకున్న ఈ దంపతులు, పనిని దేవుని సేవగా భావించాలని, వినమ్రతతో నామస్మరణ చేయాలని మహారాజ్ సూచించారు. ఏడాది కాలంలో బృందావన్‌ను వాళ్లిద్దరూ సందర్శించడం ఇది మూడోసారి. ప్రస్తుతం కోహ్లీ త్వరలో జరగబోయే విజయ్ హజారే ట్రోఫీలో ఆడనున్నాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆయన భార్య అనుష్క శర్మ భారత్‌కు తిరిగొచ్చిన వెంటనే బృందావన్‌లోని శ్రీహిత్ రాధా కేళి కుంజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. ప్రేమానంద్ జీ మహారాజ్‌ను కలిసిన ఈ దంపతులు ఆయనతో ఏకాంతిక ఆధ్యాత్మిక సంభాషణ జరిపారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది.భజన్ మార్గ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా విడుదల చేసిన వీడియోలో ప్రేమానంద్ జీ మహారాజ్ విరాట్ కోహ్లీ , అనుష్క శర్మలకు జీవితంపై విలువైన సందేశం అందించారు. "మీరు చేసే పనిని దేవుని సేవగా భావించండి. గంభీరంగా ఉండండి. వినమ్రతను అలవర్చుకోండి. నిత్యం నామస్మరణ చేస్తూ ఉండండి" అంటూ మహారాజ్ కోహ్లీ–అనుష్క దంపతులకు మార్గనిర్దేశం చేశారు.2025లో విరాట్, అనుష్కలు బృందావన్‌ను సందర్శించడం ఇది మూడోసారి కావడం విశేషం. ఈ ఏడాది జనవరిలో తమ పిల్లలు వామిక, అకాయ్‌తో కలిసి ప్రేమానంద్ జీ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. అంతేకాకుండా మే నెలలో విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మరుసటి రోజే ఈ దంపతులు బృందావన్ వెళ్లి ఆశ్రమాన్ని దర్శించుకున్నారు.టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ, విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌తో పాటు ఐపీఎల్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం కోహ్లీ డిసెంబర్ 24 నుంచి ప్రారంభం కానున్న విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొననున్నాడు. అయితే ఢిల్లీ జట్టు తరఫున కొన్ని మ్యాచ్‌లకే అందుబాటులో ఉండే అవకాశం ఉంది.దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్ అనంతరం విరాట్ కోహ్లీ మళ్లీ ఇంగ్లండ్‌కు వెళ్లాడు. ప్రస్తుతం కుటుంబంతో అక్కడే నివసిస్తున్నాడు. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న భారత్ – న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం విరాట్ తిరిగి భారత జట్టులో చేరనున్నాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీతో తన కమ్ బ్యాక్ ఎలా ఉంటుందో కోహ్లీ అందరికీ చూయించాడు. రానున్న న్యూజిలాండ్ సిరీస్‌లోనూ రాణించి వన్డే వరల్డ్ కప్ 2027లో తన పేరు ఖాయం చేసుకోవాలని కోహ్లీ చూస్తున్నాడు.

# భారీ ధర పలుకుతాడు అనుకుంటే ఇదేందిదీ!



ఐపీఎల్ 2026 మినీ వేలంలో అందరినీ ఆశ్చర్యపరుస్తూ లియామ్ లివింగ్‌స్టోన్ అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. కామెరూన్ గ్రీన్ భారీ ధరకు అమ్ముడైన తర్వాత, లివింగ్‌స్టోన్ కూడా అదే రేంజ్‌లో అమ్ముడవుతాడని అందరూ ఊహించారు. కానీ, ఊహించని విధంగా ఏ ఫ్రాంఛైజీ కూడా అతడి కోసం పోటీ పడలేదు. గత సీజన్‌లో ఆర్సీబీ అతడిని రిలీజ్ చేసింది. దుబాయ్ టీ20 లీగ్‌లో రాణిస్తున్నా, ఐపీఎల్ మినీ వేలంలో మాత్రం లివింగ్‌స్టోన్‌కు నిరాశే ఎదురైంది. ఐపీఎల్ 2026 మినీ వేలం చాలా ఆసక్తికరంగా సాగుతోంది. ఏ ప్లేయర్ సోల్డ్ అవుతున్నాడో, ఏ ప్లేయర్ అన్‌సోల్డ్ అవుతున్నాడో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. అయితే, కామెరూన్ గ్రీన్ మాత్రం అందరూ ఊహించినట్టుగానే భారీ ధరకు అమ్ముడయ్యాడు. గ్రీన్ తర్వాత అంత రేటు పలికే ప్లేయర్ ఎవరంటే అందరూ లియామ్ లివింగ్‌స్టోన్ అనే అనుకున్నారు. కానీ, ఐపీఎల్ ఫ్రాంఛైజీలు అన్ని కలిసి ఒక్కసారిగా ట్విస్ట్ ఇచ్చాయి. దాంతో లివింగ్‌స్టోన్ అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాయి.మొదటి రౌండ్ బిడ్డింగ్‌లో భాగంగా కామెరూన్ గ్రీన్ తర్వాత లియామ్ లివింగ్‌స్టోన్ వేలంలోకి వచ్చాడు. కామెరూన్ గ్రీన్‌ను కేకేఆర్ రూ. 25.2 కోట్లకు దక్కించుకుంది. గ్రీన్ తర్వాత లివింగ్‌స్టోన్ వేలంలోకి రావడంతో లివింగ్‌స్టోన్ కోసం కేకేఆర్, చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంఛైజీలు అదే రేంజ్‌లో పోటీకి దిగుతాయని అందరూ ఊహించారు. కనీస ధర రూ.2 కోట్లకు వచ్చిన లివింగ్‌స్టోన్ కోసం కనీసం ఒక్క ఫ్రాంఛైజీ కూడా పోటీకి రాకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన మాక్ ఐపీఎల్‌లో లివింగ్‌స్టోన్ ఏకంగా రూ. 19 కోట్లకు అమ్ముడయ్యాడు.ఐపీఎల్ 2025లో లియామ్ లివింగ్‌స్టోన్ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంఛైజీ రూ. 8.75 కోట్లకు సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ కోటలో జట్టులో చేరిన లివింగ్‌స్టోన్ అనుకున్న స్థాయిలో ప్రదర్శన చేయలేదు. దాంతో కేవలం 16 మ్యాచ్‌లలో ఆర్సీబీ 10 మ్యాచ్‌లలోనే లివింగ్‌స్టోన్‌ను ఆడించింది. లాస్ట్ సీజన్‌లో విఫలమవ్వడంతో ఐపీఎల్ మినీ వేలానికి ముందు ఆర్సీబీ లివింగ్‌స్టోన్‌ను రిలీజ్ చేసింది.అయితే, మినీ వేలం ప్రారంభానికి ముందు వరకూ అందరూ ఊహించింది కేకేఆర్, సీఎస్కేలో కామెరూన్ గ్రీన్‌ను ఏ జట్టయితే దక్కించుకుంటుందో, అది కాకుండా మరో జట్టు లివింగ్‌స్టోన్‌ను సొంతం చేసుకుంటుందని! కామెరూన్‌ను కేకేఆర్ దక్కించుకోవడంతో.. లివింగ్‌స్టోన్‌ను సీఎస్కే సొంతం చేసుకుంటుందని అనుకున్నారు. కానీ, ఎవ్వరూ ఊహించనట్టుగా అన్‌సోల్డ్ అయ్యాడు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఐఎల్‌టీ20లో కూడా లివింగ్‌స్టోన్ బ్యాటింగ్, బౌలింగ్‌లో కూడా రాణిస్తూ మ్యాచ్ విజయాల్లో కీలకంగా మారాడు. మెయిన్ వేలంలో అమ్ముడుపోని లివింగ్‌స్టోన్‌ను యాక్సిలరేటెడ్ ఆక్షన్‌లో అయినా ఫ్రాంఛైజీలు తీసుకుంటాయో లేదో చూడాలి!

# కోటి రూపాయలకే ఎగరేసుకెళ్లిన అంబానీ



టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి మళ్లీ వచ్చిన క్వింటన్ డికాక్‌ను ముంబై ఇండియన్స్ కేవలం కోటి రూపాయలకే సొంతం చేసుకుంది. చివరి నిమిషంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న డికాక్ కోసం వేరే ఫ్రాంఛైజీలు పోటీ పడలేదు. ఐపీఎల్ మినీ వేలంలో కామెరూన్ గ్రీన్ రూ.25.2 కోట్లకు, మతీషా పథిరన రూ.18 కోట్లకు కేకేఆర్ సొంతమయ్యారు. లియామ్ లివింగ్‌స్టోన్ ఈ వేలంలో గ్రీన్ తర్వాత అత్యధిక ధర పలుకుతాడు అనుకుంటే అన్ సోల్డ్‌గా మిగిలిపోయాడు. టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి మళ్లీ పొట్టి ఫార్మాట్‌లోకి అడుగుపెట్టిన సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ క్వింటన్ డికాక్‌ను ఐపీఎల్ మినీ వేలంలో ముంబై తక్కువ ధరకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ మినీ వేలంలో క్వింటన్ డికాక్ వేలం చాలా ఆసక్తికరంగా మారింది. బేస్ ప్రైజ్ రూ. కోటితో అడుగుపెట్టిన డికాక్ వేలం చాలా తక్కువ సేపే కొనసాగింది. కనీస ధర మీద వచ్చిన డికాక్‌ను ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీ అదే ధరకు సొంతం చేసుకుంది.ఐపీఎల్ 2026 రిజిస్ట్రేషన్ కోసం క్వింటన్ డికాక్ తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. కానీ, ఆఖరి నిమిషంలో ముంబై ఇండియన్స్ పట్టుబట్టి అతని కోసం బీసీసీఐతో మాట్లాడి రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత డికాక్ పేరు చేర్చింది. ఆ కారణంగానే డికాక్ కోసం కేవలం ముంబై ఇండియన్స్ తప్ప మరే ఇతర ఫ్రాంఛైజీ కూడా పోటీలోకి దిగలేదు. రూ.2.75 కోట్ల పర్స్‌తో ఉన్న ముంబై రూ. కోటితో డికాక్‌ను సొంతం చేసుకుని, మిగతా రూ.1.75 కోట్లతో లోకల్ ప్లేయర్లను కొనుగోలు చేయాలని చూస్తోంది.భారత్ – దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో డికాక్ అద్భుతంగా రాణిస్తున్నాడు. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 90కి పైగా పరుగులు నమోదు చేసి సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఐపీఎల్ ఎంట్రీ ఇస్తున్న సమయంలో డికాక్ భారీ స్కోర్ చేయడంతో ఈ సారి వేలంలో పోటీ ఉంటుందని అందరూ అనుకున్నారు. కానీ, ముంబై ఇండియన్స్ చవకగా రూ.కోటికే సొంతం చేసుకుంది. ఈసారి ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఓపెనర్స్‌గా రోహిత్ శర్మ, డికాక్ బరిలోకి దిగే అవకాశం ఉంది.ఐపీఎల్ మినీ వేలంలో కామెరూన్ గ్రీన్ అందరికంటే అత్యధికంగా రూ.25.2 కోట్ల ధర పలికాడు.




# దివ్యభారతి ఎద అందాలు

'బ్యాచిలర్' సినిమాతో యువ హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ దివ్యభారతి.. 'గోట్' మూవీతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. తెలుగులో ఫస్ట్ సినిమా రిలీజ్ కాకముందే అమ్మడికి ఇక్కడ మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ఫోటోలు, వీడియోలు క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. లేటెస్టుగా దివ్యభారతి ఇన్స్టాగ్రామ్ లో పంచుకున్న పిక్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



# ఏదైనా ఉంటే నేనే చెబుతా

టాలీవుడ్‌లో వరుస హిట్లతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి మెహ్రీన్ పీర్జాదా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇటీవల ఆమె సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో ఈ అంశంపై ఆమె స్పందించింది. తాను ఎవరినీ వివాహం చేసుకోలేదని, తనకు పరిచయం కూడా లేని వ్యక్తితో పెళ్లి జరిగిందంటూ రాయడం బాధాకరమని మెహ్రీన్ స్పష్టం చేసింది. పెళ్లి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా స్వయంగా ప్రకటిస్తానని చెప్పింది. వ్యక్తిగత జీవితంపై తప్పుడు రూమర్స్ ప్రచారం చేయొద్దని ఆమె కోరింది. ప్రస్తుతం మెహ్రీన్ కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెట్టిందని తెలిపింది.



టాలీవుడ్‌లో తన తొలి సినిమాతోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న హీరోయిన్లలో మెహ్రీన్ పీర్జాదా ఒకరు. 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ పంజాబీ భామ, తన క్యూట్ లుక్స్‌తో పాటు సహజమైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నాని సరసన నటించిన ఆ చిత్రంలో 'మహాలక్ష్మి' పాత్రలో మెహ్రీన్ చేసిన నటనకు ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్', 'ఖీ2', 'ఖీ3' వంటి వరుస విజయాలతో టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఒక దశలో టాలీవుడ్‌లో అత్యంత బిజీ నటిగా కొనసాగిన మెహ్రీన్, గత కొంతకాలంగా సినిమాలకు కొంత దూరంగా కనిపిస్తోంది.




# 2025లో కోలీవుడ్, శాండల్‌వుడ్, బాలీవుడ్‌దే హవా




2025లో భారతీయ సినిమా రంగంలో భారీ చిత్రాల పోటీ తీవ్రంగా కనిపించినా, బాక్సాఫీస్ వద్ద 500 కోట్ల మార్క్‌ను దాటిన తెలుగు సినిమా మాత్రం కనిపించలేదు. బాలీవుడ్, కోలీవుడ్, శాండిల్‌వుడ్ పరిశ్రమలకు చెందిన చిత్రాలు భారీ వసూళ్లతో రికార్డులు నెలకొల్పాయి. కన్నడ చిత్రం 'కాంతారా: చాప్టర్ 1', తలైవా నటించిన 'కూలీ', బాలీవుడ్ హిట్లు 'ఛావా', 'సైయారా', 'దురంధర్' 500 కోట్లకు పైగా గ్రాస్ సాధించాయి. ఇక టాలీవుడ్‌లో ఈ ఏడాది టాప్ గ్రాసర్‌గా నిలిచిన సినిమాలు 300 కోట్ల వరకే పరిమితమయ్యాయి. ఏటా భారతీయ సినిమా రంగంలో భారీ అంచనాలతో ఎన్నో చిత్రాలు థియేటర్లలోకి వస్తుంటాయి. కొన్ని సినిమాలు తమ తమ భాషల పరిధిని దాటి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తే, మరికొన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదలై బాక్సాఫీస్ వద్ద రికార్డులు బద్దలు కొడతాయి. 2025 సంవత్సరంలో కూడా ఇలాంటి భారీ చిత్రాల పోటీ గట్టిగానే కనిపించింది. బాలీవుడ్ , కోలీవుడ్ , శాండిల్‌వుడ్ చిత్రాలు వరుసగా భారీ వసూళ్లతో దూసుకెళ్లగా, టాలీవుడ్ మాత్రం ఈ ఏడాది ఆ రేంజ్‌లో మెరుపులు మెరవలేకపోయింది. ముఖ్యంగా 500 కోట్ల క్లబ్ విషయంలో తెలుగు సినిమా వెనుకబడి ఉండటం అభిమానులను నిరాశకు గురి చేసింది. 2025 సంవత్సరం మొత్తాన్ని పరిశీలిస్తే, పలు భాషల సినిమాలు బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను సాధించాయి. ఈ ఏడాది మొత్తం ఐదు సినిమాలు 500 కోట్ల మార్క్‌ను దాటడం విశేషం. ఇందులో బాలీవుడ్, కోలీవుడ్, శాండిల్‌వుడ్ పరిశ్రమలకు చెందిన చిత్రాలే చోటు దక్కించుకున్నాయి. అక్టోబర్ 2, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి నటించిన 'కాంతారా: చాప్టర్ 1' భారీ స్పందనను అందుకుంది. తొలి భాగానికి వచ్చిన క్రేజ్‌కు తగ్గట్టే ఈ ప్రీక్వెల్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుని, ప్రపంచవ్యాప్తంగా రూ.800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించింది. ఇక కోలీవుడ్ నుంచి వచ్చిన భారీ చిత్రం 'కూలీ' కూడా ఈ ఏడాది టాప్ గ్రాసర్స్ జాబితాలో నిలిచింది. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజినీకాంత్ నటించిన ఈ సినిమా అన్ని భాషల్లో విడుదలై, దాదాపు 580 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. యాక్షన్, మాస్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రం కోలీవుడ్ సత్తాను మరోసారి చాటింది. బాలీవుడ్ విషయానికి వస్తే, ఈ ఏడాది అక్కడి చిత్రాలు బాక్సాఫీస్‌ను ఊపేశాయి. కొత్త హీరో అహాన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన రొమాంటిక్ మ్యూజికల్ డ్రామా 'సైయారా' ఊహించని స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు 570 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను నమోదు చేసింది. అలాగే ఫిబ్రవరి 14, 2025న విడుదలైన 'ఛావా' బాలీవుడ్‌కు ఈ ఏడాది అతిపెద్ద హిట్‌గా నిలిచింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్ర పోషించగా, రష్మిక మందానా కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఇక ఏడాది చివర్లో విడుదలైన రణవీర్ సింగ్ సినిమా 'దురంధర్' కూడా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. డిసెంబర్ 11న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా కేవలం పది రోజుల్లోనే 500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇన్ని భారీ విజయాల మధ్య టాలీవుడ్ పరిస్థితి మాత్రం నిరాశాజనకంగా మారింది. 2025లో ఇప్పటివరకు విడుదలైన తెలుగు సినిమాల్లో ఏ ఒక్కటి కూడా 500 కోట్ల మార్క్‌ను దాటలేకపోయింది. సంక్రాంతి కానుకగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాప్ గ్రాసర్‌గా నిలిచినా, ఆ తర్వాత వచ్చిన సినిమాలు కూడా అదే స్థాయిలో ఆగిపోయాయి.పవన్ కళ్యాణ్ 'ఓజీ' రూ.500 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్నా రూ.300 కోట్ల వద్దే ఆగిపోయింది. గతేడాది 'పుష్ప 2', 'కల్కి' లాంటి చిత్రాలు రూ.1000 కోట్ల క్లబ్‌లోకి చేరిన నేపథ్యంలో, ఈ ఏడాది అలాంటి ఘన విజయం లేకపోవడం తెలుగు అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. అయితే 2026లో పరిస్థితి మారుతుందనే ఆశలు కనిపిస్తున్నాయి. సంక్రాంతి బరిలో పలువురు స్టార్ హీరోల సినిమాలు పోటీ పడుతున్నాయి. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', 'ఫౌజీ', రామ్‌చరణ్ 'పెద్ది', ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ 2026లో విడుదల కానున్నాయి. దీంతో వచ్చే ఏడాది కనీసం రెండు సినిమాలైనా 1000 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెడతాయని సినీ లవర్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2025లో వెనుకబడ్డ టాలీవుడ్, 2026లో తిరిగి తన సత్తా చాటుతుందా అన్నది కాలమే చెప్పాలి.

# 'పెద్ది' దెబ్బకి యూట్యూబ్ షేక్... తెలుగులో సెంచరీ కొట్టిన 'చికిరి'



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ సినిమా నుంచి విడుదలైన తొలి సింగిల్ 'చికిరి చికిరి' పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన నెలలోనే తెలుగు వెర్షన్ 100 మిలియన్ వ్యూస్‌ను దాటగా, అన్ని భాషల్లో కలిపి 150 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించింది. ఏఆర్ రెహమాన్ అందించిన ఎనర్జిటిక్ ట్యూన్, రామ్ చరణ్ పవర్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేరు వినిపిస్తేనే టాలీవుడ్‌లో అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అలాంటి చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ' పెద్ది ' ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ బజ్‌ను క్రియేట్ చేస్తోంది. 'ఉప్పెన' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, కథ, స్కేల్, టెక్నికల్ వాల్యూస్ అన్నింట్లోనూ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. రామ్ చరణ్‌ను పక్కా మాస్ అవతార్‌లో చూపించనున్న ఈ సినిమాలో ఆయన లుక్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కూడా భాగస్వాములుగా ఉండటం సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి విడుదలైన తొలి పాట 'చికిరి చికిరి' దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పాట విడుదలైన నాటి నుంచి సోషల్ మీడియా, యూట్యూబ్, మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ సాంగ్‌కు విపరీతమైన స్పందన లభిస్తోంది. రెహమాన్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు, క్యాచీ ట్యూన్ ఈ పాటను ప్రతి వర్గం ప్రేక్షకులకు దగ్గర చేసింది. ముఖ్యంగా రామ్ చరణ్ చూపించిన ఎనర్జీ, పవర్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ఫ్యాన్స్‌ను మంత్రముగ్ధులను చేశాయి. ఆయన స్టెప్స్‌ను అనుకరిస్తూ వేల సంఖ్యలో రీల్స్, షార్ట్ వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. వ్యూస్ పరంగా కూడా 'చికిరి చికిరి' పాట సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. కేవలం ఒక నెల వ్యవధిలోనే తెలుగు వెర్షన్ ఒక్కటే 100 మిలియన్ల వ్యూస్‌ను దాటడం విశేషంగా మారింది. అంతేకాదు, ఐదు భాషల్లో విడుదలైన ఈ పాట అన్ని వెర్షన్లను కలుపుకుని చూస్తే 150 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించింది. ఈ స్థాయి స్పందన రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. పాటపై వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, సినిమా రిలీజ్‌కు ముందే 'పెద్ది' పేరు దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ పాటను తెరకెక్కించిన విధానం కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది. ప్రతి ఫ్రేమ్‌లో కనిపించే విజువల్ గ్రాండియర్, లొకేషన్ ఎంపిక, కెమెరా వర్క్ పాటకు మరింత ఎలివేషన్ ఇచ్చాయి.

# మంచు మనోజ్ మూవీలో రామ్‌చరణ్ క్యామియో



ఒకప్పుడు టాలీవుడ్‌లో బిజీ హీరోగా ఉన్న మంచు మనోజ్ మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల 'మిరాయ్' సినిమాతో విలన్‌గా భారీ విజయాన్ని అందుకున్న మనోజ్, ఇప్పుడు హీరోగా 'డేవిడ్ రెడ్డి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించి మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ క్యామియో చేస్తారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. మనోజ్‌కు క్లోజ్ ఫ్రెండ్ అయిన శింబు ఒక ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. బ్రిటిష్ పాలన నేపథ్యంలోని పీరియడ్ ఫిలింగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్‌లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ ఉన్న నటుడిగా కొనసాగుతున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత ఆయన చేసే ప్రతి ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి నెలకొంది. అదే సమయంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో బిజీ హీరోగా వెలుగొందిన మంచు మనోజ్ పేరు కూడా మళ్లీ ఇండస్ట్రీలో చర్చకు వస్తోంది. వరుస ఫ్లాపులు, వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకుల కారణంగా కొన్నేళ్ల పాటు సినిమాలకు దూరమైన మనోజ్ ఇప్పుడు కొత్త ఉత్సాహంతో కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వీరిద్దరి పేర్లు ఒకే ప్రాజెక్ట్‌తో లింక్ కావడం ఆసక్తికరంగా మారింది. ఒకప్పుడు యంగ్ హీరోల జాబితాలో మంచి స్థానం సంపాదించుకున్న మంచు మనోజ్, అనుకోని బ్రేక్‌తో పూర్తిగా సైలెంట్ అయ్యాడు. వరుస పరాజయాలు ఆయన కెరీర్‌పై ప్రభావం చూపగా, వ్యక్తిగత జీవితంలో వచ్చిన సమస్యలు మరింత దూరం తీసుకెళ్లాయి. దాదాపు ఐదు నుంచి ఆరు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఒక దశలో ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పినట్టే కనిపించాడు. అయితే గత ఏడాది నుంచి మళ్లీ నటనపై దృష్టి పెట్టి, సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాడు. ఈ ఏడాది మంచు మనోజ్ నటించిన రెండు సినిమాలు విడుదలయ్యాయి. రీఎంట్రీ మూవీగా వచ్చిన 'భైరవం' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో నిలవకపోయినా, 'మిరాయ్' మాత్రం భారీ విజయాన్ని అందుకుంది. ఈ రెండు చిత్రాల్లోనూ మనోజ్ హీరోగా కాకుండా విలన్ పాత్రల్లో కనిపించడం విశేషం. ముఖ్యంగా 'మిరాయ్'లో ఫుల్ లెంగ్త్ నెగెటివ్ రోల్ చేసి తన నటనతో ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకున్నాడు. దీంతో టాలీవుడ్‌కు ఒక బలమైన విలన్ దొరికాడనే అభిప్రాయం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. అయితే మనోజ్ నెగెటివ్ పాత్రలకే పరిమితం కావడం లేదు. హీరోగా కూడా మళ్లీ తన సత్తా చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. తాజాగా ఆయన హీరోగా ' డేవిడ్ రెడ్డి ' అనే సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం క్యాస్టింగ్ వర్క్ జరుగుతోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో ఆసక్తికర అంశం బయటకు వచ్చింది. 'డేవిడ్ రెడ్డి'లో రెండు కీలక అతిథి పాత్రలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వాటిలో ఒక పాత్రను తమిళ స్టార్ హీరో శింబు చేయనున్నాడని సమాచారం. మనోజ్‌కు, శింబుకు మంచి స్నేహం ఉండటంతో ఈ వార్తకు బలం చేకూరుతోంది. అంతేకాదు, మరో క్యామియో కోసం మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్‌ను సంప్రదించినట్టు టాక్ వినిపిస్తోంది. మనోజ్, చరణ్ ఇద్దరి మధ్య ఉన్న స్నేహం అందరికీ తెలిసినదే. అయితే ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్‌గా బిజీగా ఉన్న చరణ్ ఈ దశలో క్యామియో చేయడం సాధ్యమా అనే ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది. పాత్రకు కథలో ప్రాధాన్యం ఉంటే, తన ఇమేజ్‌కు ఇబ్బంది లేకపోతే చరణ్ ఆలోచించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. 'డేవిడ్ రెడ్డి' కథ బ్రిటిష్ పాలన కాలం నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమానికి ముందున్న సామాజిక పరిస్థితులు, ఒక పోరాట యోధుడి ప్రయాణం ఈ చిత్రానికి ప్రధానాంశంగా ఉండబోతున్నాయట. హనుమరెడ్డి యక్కంటి అనే కొత్త దర్శకుడు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com